క్లుప్తంగా

సీసీ కెమెరాల ఏర్పాటుకు విరాళం



సీఐ భూపాల్‌శ్రీధర్‌కు చెక్కు అందజేస్తున్న వైభవ్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే

చేవెళ్ల: సమాజ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం అన్నారు. మండల కేంద్రంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు గురువారం చేవెళ్లకు చెందిన బీజేపీ యువ నాయకుడు డాక్టర్ మల్గారి వైభవ్‌రెడ్డి 4లక్షల రూపాయల చెక్కును మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నంతో కలిసి సీఐ భూపాల్‌శ్రీధర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా యువ నేత డాక్టర్ వైభవ్‌రెడ్డిని సీఐ అభినందించారు. కార్యక్రమంలో మల్గారి దినేశ్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, అనంత్‌రెడ్డి కృష్ణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, మచ్చేందర్‌రెడ్డి, శంకర్ ఉన్నారు.

ప్రభుత్వ భూమిని కాపాడాలని వినతి

షాద్‌నగర్: ప్రభుత్వ భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని నేరళ్లచెరువు గ్రామస్తులు తహసీల్దార్ పార్థసారధికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం గత కొన్నేళ్ల క్రితం రైతులకు పరిహారం చెల్లించి భూమిని తీసుకొని గ్రామ శివారులోని సర్వే నెంబర్ 228, 229లలో నీటిని నిల్వచేసేందుకు ఏడు ట్యాంకులను నిర్మించిందని పేర్కొన్నారు. అయితే ప్రభుత్వానికి చెందిన ఆ భూమి అన్యాక్రాంతమవుతోందని పేర్కొన్నారు. భూమి అన్యాక్రాంతం కాకుండా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో క్రాంతి, శివ, ప్రదీప్, జావిద్, భూపాల్ ఉన్నారు.

మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరుపెట్టాలి

బీఆర్‌ఎస్ గ్రామ అధ్యక్షుడు రాంచందర్

మొయినాబాద్: మండలంలో కొత్తగా ఏర్పాటు చేయనున్న మున్సిపాలిటీకి చిలుకూరు బాలాజీ పేరుపెట్టాలని బీఆర్‌ఎస్ చిలుకూరు గ్రామ అధ్యక్షుడు చదువు రాంచందర్ అన్నారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మున్సిపాలిటీలో కలిపే ఏడు గ్రామ పంచాయతీల్లో చిలుకూరు పంచాయతే పెద్దదన్నారు. జనాభా, ఓటర్ల, రెవెన్యూ చిలుకూరు గ్రామంలోనే అధికంగా ఉందన్నారు. అదేవిధంగా కలియుగ దైవం బాలాజీవేంకటేశ్వర స్వామి ఉన్న చిలుకూరు పేరుతో మున్సిపాలిటీ చేస్తేనే బాగుంటుందన్నారు. చిలుకూరు పేరు పెట్టడానికి ప్రభుత్వం ఆలోచన చేయాలని కోరారు.

మున్సిపల్ ఏర్పాటులో ఏకపక్ష నిర్ణయం వద్దు

చిలుకూరు మాజీ సర్పంచ్ వీరభద్రస్వామి

మొయినాబాద్: మున్సిపాలిటీ ఏర్పాటు విషయంలో ప్రభుత్వం ఏకపక్ష నిర్ణయం తీసుకోవద్దని చిలుకూరు మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి అన్నారు. గురువారం మొయినాబాద్‌లో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. మండలంలోని ఏడు గ్రామాలను గ్రామ పంచాయతీలుగానే ఉంచాలని, మున్సిపాలిటీగా మార్చొద్దన్నారు. మున్సిపాలిటీగా ఏర్పాటు చేస్తే ప్రజలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతాయన్నారు. 80శాతం పేద ప్రజలు ఉన్న గ్రామాలను మున్సిపాలిటీగా ఎవరి ప్రయోజనాల కోసం మారుస్తారని ప్రశ్నించారు. మున్సిపాలిటీ ఏర్పాటు చేయాలంటే ముందుగా గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టాలన్నారు. ప్రజల అభిప్రాయం తీసుకొని ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఒకవేళ మున్సిపాలిటీ ఏర్పాటు అనివార్యమైతే చిలుకూరు బాలాజీ పేరుతో ఏర్పా టు చేయాలన్నారు. అత్యధిక జనాభా, ఓటర్లు ఉన్న చిలుకూరు గ్రామానికి గతం నుంచి అన్యాయం జరుగుతుందన్నారు. మండలాల ఏర్పాటు సమయంలోనూ చిలుకూరులో ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటు చేసి మొయినాబాద్ మండలంగా పేరు పెట్టారన్నారు. ఇప్పు డు అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా ప్రభుత్వం నిర్ణయం తీసుకోవాలన్నారు.

నీటిని వృథా చేయొద్దు

కౌన్సిలర్ కొందూటి మహేశ్వరి

షాద్‌నగర్: మంచి నీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలని కౌన్సిలర్ కొందూటి మహేశ్వరి అన్నారు. గురువారం పట్టణంలోని 20వ వార్డులో నూతనంగా ఏర్పాటు చేసిన బోరు మోటార్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించేందుకు చర్యలు చేపట్టామన్నారు. ప్రజలందరూ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రతి ఒక్కరూ నీటి వృథాను అరికట్టాలన్నారు. కార్యక్రమంలో గ్రంథాలయ కమిటీ మాజీ డైరెక్టర్ పినమోని గోపాల్, వార్డు ఆఫీసర్ మంజుల కాలనీవాసులు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీలు.. పాత సమస్యలు

జీపీలకు సొంత భవనాలు కరువు
- ఇప్పటివరకు ఏర్పాటు కాని రేషన్ దుకాణాలు
- సరుకుల కోసం అవస్థలు పడుతున్న ప్రజలు



ఇరుకుగా ఉన్న జీపీ పాలన గది

కేశంపేట: గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం 2016 ఆగస్టులో జిల్లాలు, మండలాల పునర్వ్యవస్థీకరణకు నోటిఫికేషన్ జారీచేసి, అక్టోబర్‌లో నూతన జిల్లాలు, మండలాలను ఏర్పాటు చేసింది. వీటితో పాటు నూతన గ్రామ పంచాయతీలను ఏర్పాటు చేశారు. మండలంలో 20 గ్రామ పంచాయతీలు ఉండగా మరో 9 జీపీలను నూతనంగా ఏర్పాటు చేశారు. కొత్తగా ఏర్పడిన జీపీలకు సొంత భవనాలు, రేషన్ దుకాణాలు లేక సరుకుల కోసం ప్రజలకు ఇబ్బందులు తప్పడం లేదు.

రేషన్ దుకాణాలు లేక..

మండలంలో ప్రస్తుతం ఉన్న 29 గ్రామ పంచాయతీలకు గాను 29 రేషన్ దుకాణాలు ఉన్నాయి. వీటి పరిధిలో 11,283 తెల్లరేషన్ కార్డులు, 717 అంత్యోదన కార్డులు ఉన్నాయి. మొత్తం మండలంలో 12,000ల రేషన్ కార్డులు ఉన్నాయి. వీటికి 232 క్వింటాళ్ల బియ్యాన్ని ప్రభుత్వం ప్రతి నెల సరఫరా చేస్తోంది. మండలంలో దత్తాయపల్లి, దేవునిగుడి తండా, తూర్పుగడ్డతండా, చింతకొంతపల్లి, పుట్టోనిగూడ, సుందరపురం, కోనాయపల్లి, మంగళిగూడ, పొల్కొనిగుట్టతండాలు నూతనంగా ఏర్పాటయ్యాయి. ఈ గ్రామాల పరిధిలో దత్తాయపల్లి గ్రామంలో తప్పా మిగతా గ్రామాల్లో రేషన్ దుకాణాలు లేకపోవడంతో ఉమ్మడి గ్రామ పంచాయతీల పరిధిలో ఉన్న రేషన్ దుకాణాలకు వెళ్లి ప్రజలు సరుకులు తెచ్చుకుంటున్నారు. ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీల పరిధిలో రేషన్ దుకాణాలు ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పరిపాలన భవనం కరువు..

నూతనంగా ఏర్పడిన జీపీల్లో పంచాయతీ భవనాలు లేవు. కొన్ని గ్రామాల్లో పాఠశాల భవనాలు, మరికొన్ని గ్రామాల్లో ఇరుకైన అద్దె గదుల్లో గ్రామ పంచాయతీ భవనాలు కొనసాగుతున్నాయి. సర్పంచ్‌కు, పంచాయతీ కార్యదర్శికి కూర్చోవడానికి కూడా ప్రత్యేక గదులు లేవు. పాలకవర్గాల మీటింగ్‌లకు కూడా సమావేశ మందిరం లేక గతంలో పాలకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామానికి చెందిన రికార్డులను భద్రపర్చాడనికి కూడా అనువైన స్థలం లేక పంచాయతీ కార్యదర్శులు ఇబ్బంది పడుతున్నారు.



పాటిగడ్డలో అసంపూర్తిగా ఉన్న జీపీ భవన నిర్మాణం

మంజూరైనా నిర్మాణాలు లేవు..

మండల పరిధిలోని పోల్కొనిగుట్టతండా, దేవునిగుడితండా, తూర్పుగడ్డతండా, సుందరపురం, సంతాపూర్, కోనాయపల్లి, పుట్టోనిగూడ గ్రామాల్లో భవనాల నిర్మాణానికి నిధులు మంజూరైనా పనులు ప్రారంభించలేదు. మంగళిగూడ, పాటిగడ్డ గ్రామాల్లో నిర్మాణాలు అసంపూర్తిగా ఉన్నాయి. కొత్తపేట, పాపిరెడ్డిగూడ గ్రామ పంచాయతీల భవన నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగతా గ్రామాల్లో భవన నిర్మాణాలు పూర్తయినప్పటికీ అందుబాటులోకి వస్తాయో తెలియని పరిస్థితి నెలకొంది.

గ్రామంలోనే రేషన్ అందించాలి

గత ప్రభుత్వం నూతన పంచాయతీలను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా తూర్పుగడ్డతండా, గుట్టలగడ్డ తండాను కలిపి ప్రత్యేక జీపీగా ఏర్పాటు చేశారు. కానీ రేషన్ సరుకుల కోసం ప్రతి నెల తూర్పుగడ్డతండా వారు పాపిరెడ్డిగూడకు, గుట్టలగడ్డతండా వారు ఇప్పలపల్లి గ్రామానికి వెళ్లాల్సి వస్తోంది.

–రాత్లావత్ జయరాం, తూర్పుగడ్డతండా

ప్రతిపాదనలు పంపించాం

నూతనంగా ఏర్పడిన జీపీల్లో రేషన్ దుకాణాలు లేని పంచాయతీల వివరాలను ఉన్నతాధికారులకు తెలియజేశాం. ప్రస్తుతం మండలంలో 29 షాపులు ఉన్నాయి. వీటిలో రెండు షాపుల్లో డీలర్లు లేరు. వీటితో పాటు 9 నూతన గ్రామ పంచాయతీల వివరాలను అధికారులకు తెలియజేశాం.

– గీత, నాయబ్ తహసీల్దార్

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం

మండలంలో 12 జీపీలకు నిధులు మంజూరు కాగా, 2 భవనాల నిర్మాణాలు పూర్తయి, వినియోగంలోకి వచ్చాయి. 2 గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులు అసంపూర్తిగా ఉన్నాయి. ఇంకా మిగిలిన జీపీల్లో త్వరలోనే పనులు ప్రారంభమయ్యే విధంగా కృషిచేస్తాం.

– రవిచంద్రకుమార్‌రెడ్డి, ఎంపీడీఓ

ఇళ్ల సర్వే పకడ్బందీగా చేపట్టాలి

- ఎంపీడీఓ బన్సీలాల్



షాద్‌నగర్‌రూరల్: సర్వేను పరిశీలిస్తున్న ఎంపీడీఓ బన్సీలాల్

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీఓ బన్సీలాల్ సూచించారు. ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని మొగిలిగిద్ద గ్రామంలో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వేను గురువారం ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇల్లులేని నిరుపేదలకు సొంత ఇంటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. ఇంటి కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లతో ప్రభుత్వం లిస్ట్ పంపించిందని, ఆ లిస్టులో ఉన్నవారి వివరాలు సేకరిస్తామన్నారు. ఇందిరమ్మ ఇంటి సర్వేను పారదర్శకంగా చేపట్టాలని సూచించారు. ప్రభుత్వం ఇచ్చిన గడువులోగా వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసి సర్వేను పూర్తి చేయాలన్నారు. ఆన్‌లైన్ నమోదులో ఎలాంటి తప్పులకు తావివ్వకుండా సర్వేను పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ జయంత్‌రెడ్డి, పంచాయతీ క్యాదర్శి బాసిత్, కారోబార్ పాల్గొన్నారు.

లింగారెడ్డిగూడలో..

షాద్‌నగర్: మండల పరిధిలోని లింగారెడ్డిగూడ గ్రామంలో గురువారం ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్ల గ్రామ కమిటీ సభ్యులు వట్టెల మాధవి, ఎర్రోళ్ల సునీత, కార్యదర్శి రాధాకృష్ణ ఆధ్వర్యంలో సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తు చేసుకున్న వారి నుంచి వివరాలు సేకరించారు. కార్యక్రమంలో రంగంపల్లి సురేశ్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, హరికృష్ణ, శ్రీధర్‌గౌడ్, ఫకీర్ భాషా, యాదయ్య, సాయికుమార్ పాల్గొన్నారు.

అర్హులను గుర్తించేందుకు సర్వే

చేవెళ్ల: ఇందిరమ్మ పథకం కింద అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ప్రభుత్వం ఇంటింటి సర్వే నిర్వహిస్తోందని పంచాయతీ కార్యదర్శి రాఘవేందర్ అన్నారు. చేవెళ్లలో గురువారం పంచాయతీ సిబ్బందితో కలిసి ఆయన సర్వే నిర్వహించారు. ఇళ్ల సర్వేను పూర్తి చేసి వివరాలను ఎంపీడీఓకు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సిబ్బంది తదితరులు ఉన్నారు.

అప్పోజీగూడను మున్సిపాలిటీలో కలపాలి

- జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేకు గ్రామస్తుల వినతి



కలెక్టర్ నారాయణరెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: అప్పోజీగూడ గ్రామ పంచాయతీని కొత్తగా ఏర్పాటు చేయనున్న మొయినాబాద్ మున్సిపాలిటీలో కలపాలని ఆ గ్రామస్తులు జిల్లా కలెక్టర్, జిల్లా పంచాయతీ అధికారి, చేవెళ్ల ఎమ్మెల్యేకు వేర్వేరుగా వినతిపత్రాలు అందజేశారు. గురువారం అప్పోజీగూడ గ్రామస్తులు జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి సురేశ్‌మోహన్, ఎమ్మెల్యే కాలె యాదయ్యను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. గతంలో చిలుకూరు అనుబంధ గ్రామంగా ఉన్న అప్పోజీగూడ గ్రామం 2018లో ప్రత్యేక పంచాయతీగా ఏర్పడిందన్నారు. చిలుకూరును మున్సిపాలిటీలో కలిపితే దీంతో పాటు అప్పోజీగూడ గ్రామాన్ని కూడా కలపాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గొర్కంటి రాజు, మాజీ ఉపసర్పంచ్ సురేశ్, మాజీ వార్డుసభ్యులు ప్రవీణ్‌రెడ్డి, కృష్ణ, రాజు, నాయకులు జగపతి, కుమార్, రాజు, తదితరులు ఉన్నారు.

అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరు

మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు



పోలీస్‌స్టేషన్‌లో నాయకులు

షాబాద్: అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు చొక్కంపేట ఆంజనేయులు అన్నారు. గురువారం ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ అసెంబ్లీ ముట్టడి సందర్భంగా ఆంజనేయులును ముందస్తు అరెస్టు చేసి షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల సంక్షేమ సంఘం పోరాటం చేస్తుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఎస్సీ వర్గీకరణపై అత్యుత్సాహం ప్రదర్శిస్తూ మాలలకు వ్యతిరేకంగా రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారన్నారు. వర్గీకరణకు వ్యతిరేకంగా అసెంబ్లీ ముట్టడికి పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రివెంట్ అరెస్ట్ కింద షాబాద్ పోలీసులు ఉదయం 5 గంటలకు అక్రమంగా హౌస్ అరెస్ట్ చేసి నిర్బంధించి స్టేషన్‌కు తరలించారు. అక్రమ అరెస్టులతో రాజ్యాంగ రక్షణ ఉద్యమం ఆగదని, ఎంత అణచివేయాలని చూస్తే అంత రెట్టింపుస్థాయిలో ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. మాల సంక్షేమ సంఘం జిల్లా సీనియర్ నాయకుడు చంద్రశేఖర్‌ను కూడా అరెస్టు చేశారు.

దేహ దారుఢ్యానికి క్రీడలు దోహదం


- కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు జైపాల్‌రెడ్డి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న జైపాల్‌రెడ్డి

మొయినాబాద్‌రూరల్: దేహ దారుఢ్యానికి, మానసికోల్లాసానికి క్రీడలు దోహదపడతాయని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు కొత్త జైపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని అజీజ్‌నగర్‌లో ఖ–7 ఈవెంట్స్ పేరుతో ప్రొపరేటర్లు రవికాంత్‌రెడ్డి, శ్రీనాథ్ కలిసి క్రికెట్ టోర్నమెంట్‌ను రెండునెలల పాటు నిర్వహించారు. జిల్లాస్థాయిలో 20 జట్లు పాల్గొనగా రెండునెలల పాటు ఈ క్రికెట్ టోర్నమెంట్ అజీజ్‌నగర్‌లో కొనసాగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైపాల్‌రెడ్డి పాల్గొని గెలుపొందిన మొదటి బహుమతి రెడ్డిపల్లి టీమ్‌కు రూ.40వేల నగదు, షీల్డ్ అందజేశారు. రెండో బహుమతి చేవెళ్ల టీమ్‌కు రూ.25వేల నగదు, షీల్డ్ అందజేశారు. 3వ బహుమతి ఎన్కెపల్లి, 4వ బహుమతి అజీజ్‌నగర్ జట్టులకు షీల్డ్‌లు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. టోర్నమెంట్ నిర్వహించిన ఈవెంట్స్ బృందాన్ని అభినందించారు. క్రీడలతో స్నేహ సంబంధాలు పెంపొందుతాయని తెలిపారు. రాష్ట్రంలో క్రీడారంగ అభివృద్ధికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని వివిధ గ్రామాల క్రీడాకారులు, అభిమానులు పాల్గొన్నారు.

సీపీఐ వార్షికోత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మొయినాబాద్‌లో పార్టీ ఉత్సవాల వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

మొయినాబాద్: వందేళ్ల చరిత్ర కలిగిన సీపీఐ పార్టీ గొప్పతనాన్ని వాడవాడలా చాటాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వడ్ల సత్యనారాయణ అన్నారు. పార్టీ పుట్టి వంద సంవత్సరాలు అవుతున్న సందర్భంగా చేపట్టే శత జయంతి వార్షికోత్సవాల వాల్‌పోస్టర్‌ను గురువారం మండల కేంద్రంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 26న వంద వసంతాలు పూర్తవుతున్న సందర్భంగా అన్ని గ్రామాల్లో సీపీఐ జెండాలు ఎగురవేసి వేడుకలు నిర్వహించాలన్నారు. వందేళ్లలో పార్టీ చేపట్టిన ప్రజా పోరాటాలు, ఉద్యమాలు, విజయాలను ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలంతా వందేళ్ల వేడుకలను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి కె.శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

జిల్లేడ్ చౌదరిగూడలో..

కొందుర్గు: జిల్లేడ్ చౌదరిగూడ మండల కేంద్రంలో గురువారం సీపీఐ నాయకులు పార్టీ ఆవిర్భావ వేడుకలకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు బుద్దుల జంగయ్య, మండల కార్యదర్శి వెంకటయ్య, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఎస్‌జీటీయూ కమిటీ ఎన్నిక

చేవెళ్ల: ఉపాధ్యాయుల సమస్యలపై సెకండరీ గ్రేడ్ టీచర్ యూనియన్ (ఎస్‌జీటీయూ) నిరంతరం పోరాటం చేస్తోందని ఆ సంఘం జిల్లా కన్వీనర్ డి.గణేశ్, కో–కన్వీనర్ ఎం.శ్రీనివాస్ అన్నారు. మండల కేంద్రంలో గురువారం ఎస్‌జీటీయూ మండల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ డి.గణేశ్, కో–కన్వీనర్ ఎం.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన మండల అధ్యక్షుడిగా జి.దయాకర్‌రెడ్డి, మహిళా అధ్యక్షురాలిగా టి.అనసూయ, ప్రధాన కార్యదర్శిగా ఎం.లక్ష్మి, కోశాధికారిగా పి.గురు రాజశేఖర్‌రెడ్డి, మీడియా కన్వీనర్‌గా సీహెచ్ కృష్ణ, కార్యదర్శులుగా మల్కాపూర్ శ్రీనివాస్, చేవెళ్ల శ్రీనివాస్‌ను ఎన్నుకున్నారు. మండలంలో ఎస్‌జీటీయూ సంఘం అభివృద్ధికి తమవంతు కృషి చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పలు పాఠశాలల ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని వినతి

కొందుర్గు: జిల్లేడ్ పంచాయతీ కార్యదర్శి విధి నిర్వహణలో అవినీతికి పాల్పడుతోందని, ఆమెపై విచారణ జరిపి తగు చర్యలు తీసుకోవాలని జిల్లేడ్ గ్రామస్తులు ప్రభాకర్, మహేశ్, వెంకటేశ్, గిరిధర్, గోపాల్ తదితరులు గురువారం ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ కార్యదర్శి సమత ఇందిరమ్మ ఇళ్ల సర్వేలో కమిటీ సభ్యుల ప్రమేయం లేకుండా సర్వే చేపట్టి లబ్ధిదారుల వద్ద డబ్బులు వసూల్ చేస్తోందని పేర్కొన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీకి సంబంధించిన బోరు మోటార్ అక్రమంగా విక్రయించిందన్నారు. ఈ విషయమై పూర్తిస్థాయిలో విచారణ జరపాలని కోరారు.

అమిత్‌షా వెంటనే క్షమాపణలు చెప్పాలి

చేవెళ్ల: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వివాదస్పద వ్యాఖ్యలపై క్షమాపణలు చెప్పాలని చేవెళ్ల అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు ఎస్.ప్రవీణ్, సమతా సైనిక్ దళ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రామస్వామి, ఆలిండియా అంబేడ్కర్ సంఘం జిల్లా అధ్యక్షుడు బి.ప్రభాకర్, మండల అధ్యక్షుడు ఎం.శ్రీనివాస్‌లు డిమాండ్ చేశారు. గురువారం చేవెళ్లలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. అంబేడ్కర్‌పై అమిత్ షా చేసిన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకోవాలన్నారు. ఆయన రచించిన రాజ్యాంగంతోనే ప్రభుత్వాలు నడుస్తున్నాయని గుర్తుంచుకోవాలన్నారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు, ఉన్నారు.

దళితులపై కపట ప్రేమ

షాద్‌నగర్: కేంద్ర మంత్రి అమిత్‌షా దేశ ప్రజలకు వెంటనే క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత మహ్మద్ ఇబ్రహీం డిమాండ్ చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. బీజేపీ నేతలకు దళితుల పట్ల ప్రేమ లేదని, అంబేడ్కర్ పట్ల అమర్యాదగా మాట్లాడిన అమిత్‌షా వెంటనే ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

బ్యాంక్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ రాజు

చేవెళ్ల: రైతులకు బ్యాంకులు అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎస్‌బీఐ రీజనల్ మేనేజర్ పల్లం రాజు, చీఫ్ మేనేజర్ భరుత్‌సింగ్ అన్నారు. మండలంలోని కందవాడ గ్రామంలో ఎస్‌బీఐ బ్యాంక్ చేవెళ్ల బ్యాంచ్ ఆధ్వర్యంలో ఈనెల 23న రైతు దినోత్సవం సందర్భంగా రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సకాలంలో పంట రుణాలు రెన్యూవల్ చేసుకుంటే వడ్డీలో రాయితీ పొందొచ్చని తెలిపారు. రైతులకు ఉపయోగపడే బీమా పథకాలు గురించి ప్రజలు, రైతులకు వివరించారు. అనంతరం గ్రామానికి చెందిన గౌండ్ల పుష్పమ్మకు బ్యాంక్ ద్వారా వచ్చిన లోన్ మంజూరు లెటర్‌ను ఆమెకు అందజేశారు. కార్యక్రమంలో బ్యాంక్ అధికారులు ఆర్‌ఎంఆర్‌యూ మృదుల, బ్యాంక్ మేనేజర్ సంధ్య, ఫీల్డ్ అధికారి శ్వేత, సిబ్బంది, గ్రామస్తులు ఉన్నారు.

ఎన్నికల విధుల సెలవులు జమచేయాలి

- ఎంఈఓకు యూటీఎఫ్ నాయకుల వినతి



ఎంఈఓ మనోహర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

షాద్‌నగర్‌రూరల్: ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉపాధ్యాయులకు సెలవులను జమచేయాలని టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని ఎంఈఓ కార్యాలయంలో మండల విద్యాధికారి మనోహర్‌కు టీఎస్‌యూటీఎఫ్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటయ్య మాట్లాడుతూ.. మే నెలలో నిర్వహించిన గత పార్లమెంట్ ఎన్నికల విధులలో పాల్గొన్న ఉపాధ్యాయులకు సంపాదిత సెలవును జమచేయాలని కోరారు. జిల్లా విద్యాధికారి ఉత్తర్వుల ప్రకారం ప్రిసైడింగ్ ఆఫీసర్లకు 5 రోజులు, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లకు 5 రోజులు, ఇతర పోలింగ్ సిబ్బందికి 4 రోజులు పనిదినాలను జమ చేయాలన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూటీఎఫ్ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి బిజిలి సత్యం, ఉపాధ్యక్షురాలు లక్ష్మీదేవమ్మ, కోశాధికారి సురేందర్, నాయకులు తదితరులు ఉన్నారు.

ఇతర రాష్ట్రాల వాహనాలను అడ్డుకోవద్దు



మాట్లాడుతున్న సీఐ శ్రీనివాస్‌గౌడ్, ఎంవీఐ సునీత

శంకర్‌పల్లి: ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే ప్రైవేట్, టాక్సీప్లేట్ వాహనాలను ప్రైవేట్ వ్యక్తులు ఆపే అధికారం లేదని శంకర్‌పల్లి సీఐ శ్రీనివాస్‌గౌడ్, కొండాపూర్ ఎంవీఐ సునీత స్పష్టం చేశారు. గురువారం శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో బస్ డ్రైవర్లు, యజమానులకు ఈ మేరకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోలీసులు మాట్లాడుతూ.. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే వాహనాలను స్థానిక బస్సు డ్రైవర్లు, యజమానులు అడ్డగిస్తున్నట్లు తమకు సమాచారం అందిందని, అలాచేస్తే చట్టపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. వారితో ఎదురవుతున్న సమస్యలను స్థానిక పోలీసులు, ఆర్టీఏ అధికారులకు తెలియజేయాలని, అప్పుడు పరిశీలించి, నిబంధనలను అతిక్రమిస్తున్న ఇతర రాష్ట్రాల వాహనాలను అంతర్ రాష్ట్ర చెక్‌పోస్టుల వద్దనే నిలిపివేస్తామని తెలిపారు. ప్రయాణికులకు అసౌకర్యం కల్గిస్తే చట్టపరమైన కఠిన చర్యలుంటాయన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వీరేందర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం



వీరేందర్‌రెడ్డి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

కేశంపేట: తెలంగాణ ఉద్యమకారుడు, సీనియర్ న్యాయవాది తాండ్ర వీరేందర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని నాయకులు కొనియాడారు. గురువారం మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ గ్రామంలో నిర్వహించిన తాండ్ర వీరేందర్‌రెడ్డి ద్వాదశ దినకర్మకు రాష్ట్ర ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు చౌలపల్లి ప్రతాప్‌రెడ్డి, భీష్వ కిష్టయ్య, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచనకృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మహ్మద్ అలీఖాన్‌బాబర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డి, న్యాయవాదులు వీరేందర్‌రెడ్డి చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. వీరేందర్‌రెడ్డి సేవలు మరువలేనివని కొనియాడారు. కార్యక్రమంలో కాశీనాథ్‌రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, వెంకట్రామిరెడ్డి, ఎండీ.ఇబ్రహీం, శివశంకర్‌గౌడ్, సూర్యప్రకాశ్, వీరాంజనేయులుగౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

1 నుంచి ఏపీజీవీబీ పేరు మార్పు

నందిగామ బ్యాంక్ మేనేజర్ రాములు

నందిగామ: ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ ఇక నుంచి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంకుగా పేరు మారనుందని ఆ బ్యాంకు నందిగామ మేనేజర్ ఎం. రాములు అన్నారు. మండల కేంద్రమైన నందిగామలో ఆయన గురువారం మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ బ్యాంకులను అనుసంధానం చేసి ప్రతి రాష్ట్రానికి ఒకే గ్రామీణ బ్యాంకు ఉండేలా చర్యలు తీసుకుందన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంకు శాఖలు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లు కలిపి తెలంగాణ గ్రామీణ వికాస్ బ్యాంక్‌గా మార్పుచేస్తుందని వివరించారు. వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నుంచి బ్యాంకుల పేర్లు మార్పిడి అమలులోకి వస్తుందని, అందులో భాగంగా ఈ నెల 28 నుంచి 31వ తేదీవరకు బ్యాంకు సేవలు పూర్తిగా నిలిచిపోనున్నట్లు వెల్లడించారు. బ్యాంకు ఖాతాదారులు ఈ విషయాన్ని గమనించి ఈ నెల 27 వరకు తమ ఆర్థిక లావాదేవీలు యథావిధిగా కొనసాగించుకోవచ్చని సూచించారు. రేపటి మెరుగైన సమాజం కోసం జరిగే ఈ మార్పుకు ఖాతాదారులు సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.